క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం నేడు

తగరపువలస: ఈ నెల 9న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల పర్యటన సందర్భంగా ఎండాడలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం భీమిలి నియోజకవర్గ సమావేశం జరగనుంది. మాకవరపాలెం పర్యటన సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులను ఉద్దేశించి పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు దిశానిర్దేశం చేయనున్నారు. 8న ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులంతా ఎండాడ పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని చిన్న శ్రీను కోరారు.

ఘనంగా రథాల ఉత్సవం



కృష్ణాపురంలో ఊరేగిస్తున్న రథాలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో బంగారమ్మ ఉత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి రథాల ఉత్సవం ఘనంగా జరిగింది. వ్యవసాయ బళ్లను రథాలుగా తయారు చేసి, గ్రామంలో ఊరేగించారు. గ్రామ ప్రవేశం నుంచి చివర వరకు రథాలను మూడు సార్లు తిప్పారు. మహిళలు రథాలపైకి చీరలు విసిరి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

మహారాణిపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు ముఖ ఆధారిత హాజరును యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు నీటి యాజమాన్య సంస్థ జిల్లా పథక సంచాలకురాలు ఆర్.పూర్ణిమాదేవి ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పనులకు వచ్చే 47,725 మంది వేతనదారులకు ఈ–కేవైసీ చేస్తామని పేర్కొన్నారు. వేతనదారులందరూ ఆధార్ కార్డులు, జాబ్‌కార్డులతో ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ–కేవైసీ చేయని వారికి వేతన చెల్లింపులకు అవకాశం లేనందున కార్డుదారులంతా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు.

అనుమతి లేకుండా బాణసంచా తయారీ

ఇద్దరికి జ్యుడీషియల్ రిమాండ్

తగరపువలస: ఆనందపురం మండలంలోని నేలతేరు, బొడ్డపాలెం గ్రామాలలో అనుమతి లేకుండా బాణసంచా తయారీ, విక్రయాలు చేస్తున్న వారిపై స్థానిక పోలీసులు, సిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది మంగళవారం సంయుక్తంగా దాడులు చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేలతేరు గ్రామానికి చెందిన దాసరి దేముడు(75), వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలోని శ్రీకాకుళం కాలనీకి చెందిన చల్లా లక్ష్మి(42) ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలైన సల్ఫర్, గన్‌పౌడర్, ఐరన్ బీడు, తారాజువ్వలు కలిగి ఉండటంతో భీమిలిలోని న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. జడ్జి వీరికి 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

తగరపువలస: ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం అవసరమని వాసవ్య మహిళా మండలి లివ్ లవ్ ఫౌండేషన్ సాంత్వన ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎం.నాగరాజు అన్నారు. ఆనందపురం మండలం శొంఠ్యాం పీహెచ్‌సీలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మ, కమ్యూనిటీ యానిమేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ ఉత్సవం



మద్దిలో వరి దుబ్బులను ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని మద్దిలో సోమవారం రాత్రి గౌరి పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వెంకట పతిరాజు చెరువు సమీపంలోని వరి పొలాల్లో రెండు దుబ్బులను తీసి.. గౌరి, పార్వతిగా నామకరణం చేశారు. వీటితో పాటు మట్టి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. వీటిని కనకల వారి దేవిడి ఇంటిలో ప్రతిష్ఠించి నోములు నోచారు.

- అధ్వానంగా భీమిలి క్రీడా మైదానం
- వసతులు అంతంత మాత్రం
- అద్దె మాత్రం పదిరెట్లు అదనం

నిర్వహణ శూన్యం
రుసుము భారం



మైదానంలో బాగా పెరిగిపోయిన గడ్డి

భీమునిపట్నం: భీమిలిలోని ఫుట్‌బాల్ మైదానం అధ్వానంగా ఉంది. నిర్వహణ లోపంతో క్రీడలు ఆడుకునేందుకు ఏమాత్రం అనువుగా లేదు. పైగా అంతంతమాత్రంగా ఉన్న క్రీడామైదానాన్ని వినియోగించుకునేందుకు జీవీఎంసీకి రోజుకు రూ.5వేలు చెల్లించాల్సి రావడం టోర్నీలు, ఇతర నిర్వాహకులకు మరింత ఇబ్బందికరంగా మారింది.



పాడైపోయిన మరుగుదొడ్లు



దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

గతమెంతో ఘనం

భీమిలి నుంచి తగరపువలసకు వెళ్లే మార్గం పక్కన విశాలమైన ప్రాంతంలో వుడా 1991లో ఈ క్రీడా మైదానాన్ని నిర్మించింది. భీమిలి, ఆనందపురం, పద్మనాభం ప్రాంతాలకు ఇదే ప్రధానమైన మైదానం. ఇందులో క్రికెట్, ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడలు ఆడుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే వీక్షకులు కూర్చునేందుకు గ్యాలరీ, క్రీడా సామగ్రి భద్రపరచుకునేందుకు ప్రత్యేకమైన గదినీ ఏర్పాటు చేశారు. మూడు మండలాలకు ఇదే పెద్దమైదానం కావడం, అన్ని క్రీడలకు అనువుగా ఉండడంతో ఇక్కడ తరచూ పోటీలు జరిగేవి. ప్రధానంగా క్రికెట్ పోటీలు ఎక్కువగా జరగడంతో అనేక జట్లు ఉత్సాహంగా పాల్గొనేవి. మైదానం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఉండటంతో రోజూ అధిక సంఖ్యలో వాకర్స్ వాకింగ్ చేసేవారు. ఇంకా కరాటే, క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ మొదలైన క్రీడల్లో యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇవేకాకుండా రాజకీయ సమావేశాలు, కొన్ని సందర్భాల్లో వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలు కూడా జరిగేవి. దీంతో ఈ మైదానం ఎంతో గుర్తింపు పొందింది.

పదిరెట్లు రుసుము పెంపు

గతంలో ఇక్కడ క్రీడా పోటీలు నిర్వహించాలన్నా, ఏదైన సమావేశాలు, ఇతర కార్యక్రమాలు చేసుకోవడానికి జోనల్ కార్యాలయంలో రూ. 500 చెల్లిస్తే సరిపోయేది. దీంతో సమావేశాలు, టోర్నమెంట్లు, కోచింగ్ క్యాంప్‌లతో పాటు వివాహాది కార్యక్రమాలు చేసుకోవాలన్నా ఎవరికీ పెద్దగా సమస్య ఉండేది కాదు. కానీ, జీవీఎంసీ క్రీడా విభాగం మైదానం నిర్వహణ బాధ్యతలను చేపట్టాక ఆ మొత్తాన్ని పది రెట్లు పెంచేసింది. అప్పటి నుంచి ఇక్కడ ఏ పోటీలు, కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నా రోజుకు రూ. 5 వేలు చెల్లించవలసి వస్తోంది.

దెబ్బతిన్న మైదానం

కొద్ది సంవత్సరాలుగా ఈ మైదానం బాగా దెబ్బతింది. మైదానంలో గడ్డి బాగా పెరిగిపోవడంతో పాటు ఎగుడు, దిగుడుగా తయారవడంతో క్రీడలు ఆడడానికి ఇబ్బందికరంగా ఉంటోంది. ఇక వర్షాలు పడే సమయాల్లో నీరు పెద్ద ఎత్తున మైదానంలోకి వచ్చేయడంతో కొన్ని రోజులు దీన్ని వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. మరుగుదొడ్లు పూర్తిగా పాడైపోయాయి. మంచినీటి బోరు పనిచేయడం లేదు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్ బాగా దెబ్బతినడంతో రోజూ వాకర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు.

మోయలేని భారం

క్రీడామైదానం రుసుము పెంపు నిర్ణయం అందరినీ నిరాశకు గురి చేస్తోంది. మామూలుగానే మైదానం సరిగ్గా లేకపోవడంతో పాటు సమస్యలు ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. రోజుకు రూ.500 మాత్రమే చెల్లించాల్సి రావడంతో వసతులు అంతంతమాత్రంగా ఉన్నా సరిపెట్టుకునేవారు. ఇప్పుడు ఒక్కసారిగా ఏకంగా రూ.5వేలు చెల్లించాల్సి రావడంతో, భారమై నిర్వాహకులెవరూ ముందుకు రావడం లేదు. అధికారులు ఈ విషయంలో పునరాలోచించాలని, మైదానాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్వహణ రుసుమును వసూలు చేయాలని అందరూ కోరుతున్నారు.



శిథిలమైన క్రీడా సామగ్రి భద్రపరుచుకునే గది

మైదానం అస్సలు బాగాలేదు



ఇక్కడ క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలతో పాటు శిక్షణ కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతాయి. కానీ మైదానం మొత్తం అస్తవ్యస్తంగా ఉండడంతో వినియోగించుకోవడానికి ఏమాత్రం అవకాశం లేకుండా ఉంది. దీంతో అందరూ ఇబ్బంది పడుతున్నారు. మైదానాన్ని అభివృద్ధి చేసి, బాగా నిర్వహించాలి.

– టి.లక్ష్మణ్‌కుమార్, క్రికెట్ క్రీడాకారుడు, భీమిలి

రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు



ఈ మైదానం వినియోగంలోకి రావడానికి అవసరమైన పనులు చేపట్టడానికి రూ 1.50 కోట్లతో ప్రతిపాదనలు చేశాం. అందులో భాగంగా మైదానం పూర్తిగా చదును చేయడంతోపాటు నీరు నిలవకుండా ఎత్తు చేస్తాం. ఇతర అన్ని సమస్యలు పరిష్కరించి, పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తాం.

– నరేష్, ఏఈ, పబ్లిక్ వర్క్స్

త్వరలో సదుపాయాలు కల్పిస్తాం

జీవీఎంసీ పరిధిలో ఉండే అన్ని మైదానాలకు రూ. 10 వేలకు పైనే వసూలు చేస్తున్నాం. ఇక్కడ మాత్రమే తక్కువగా రూ.5వేలు వసూలు చేస్తున్నాం. ఇక్కడ అవసరమైన పనులు చేపట్టి, ఆధునిక సదుపాయాలు కల్పిస్తాం.

– రాజు, జీవీఎంసీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్

ఆర్‌హెచ్ కాలనీలో మెరుగుపడిన పారిశుధ్యం

సాక్షి ఎఫెక్ట్..

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పరిధి పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో పారిశుధ్యం మెరుగుపడింది. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం తదితర సమస్యలపై ఈ నెల 6వ తేదీన 'సమస్యల వలయంలో విలవిల' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. కాలనీలోని డ్రైనేజీలలో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బందితో తొలగింపజేశారు. దీంతో డ్రైనేజీలో మురుగు సక్రమంగా పారుతోంది. అలాగే, ఆయా శాఖల అధికారులు కూడా స్పందించి, కాలనీలో తిష్ట వేసిన మిగిలిన సమస్యలు కూడా పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కాలనీలోని డ్రైనేజీల నుంచి వెలికి తీసిన వ్యర్థాల పోగు

అమ్మవార్లకు విశేష అలంకరణలు

- అరటిపండ్ల అలంకరణలో రాసపోలమాంబ
- పైడితల్లమ్మకు పుష్పాలంకరణ

తగరపువలస: అమ్మవార్లను మంగళవారం విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమాంబ అమ్మవారిని 124వ అలంకరణలో భాగంగా మంగళవారం అరటిపండ్లతో అలంకరించారు. ఈ అలంకరణకు లక్ష్మీపురం పంచాయతీ సురాల వారి కళ్లాలకు చెందిన సురాల రమణ, సత్యవతి దంపతులు సహాయ సహకారాలు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, కాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. తాటితూరు పంచాయతీలోని పైడితల్లమ్మను ఆలయ కమిటీ ప్రతినిధులు బంతిపూల దండలు, వేపాకులతో అలంకరించారు.



రాస పోలమాంబకు అరటిపండ్ల అలంకరణ



బంతిపూల అలంకరణలో తాటితూరు పైడితల్లమ్మ

పోగొట్టుకున్న పర్స్ అందజేత

పద్మనాభం: తనకు దొరికిన పర్సును, పోగొట్టుకున్న వ్యక్తికి అందజేసి ప్రశంసలు అందుకున్నారు రేవిడి పంచాయతీ బర్లపేట గ్రామానికి చెందిన రేవిడి శ్రీనివాస సేవా యువజన సేవా సంఘం మాజీ సభ్యుడు దానయ్య. భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామానికి చెందిన దేవరపు చిరంజీవి, పద్మనాభం మండలం బర్లపేటలో ఉన్న పెట్రోల్‌బంక్ వద్ద బైక్‌కు పెట్రోల్ కొట్టించుకుని వెళ్లిపోయారు. ఆ సమయంలో అతని జేబులోని పర్సు పెట్రోల్ బంకు వద్ద రోడ్డుపై పడిపోయింది. ఇందులో రూ.5వేలు నగదు, పాన్‌కార్డు ఉన్నాయి. ఆ పర్సు దానయ్యకు దొరకడంతో ఆయన వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఆ పర్సు తనదని చిరంజీవి చెప్పడంతో, కానిస్టేబుల్ కోన సన్యాసినాయుడు చేతుల మీదుగా ఆయనకు పర్సు అందజేశారు. దానయ్యను అందరూ అభినందించారు.



చిరంజీవికి నగదు పర్సు అందజేస్తున్న సన్యాసినాయుడు

పాత సామియ్యవలసకు సరైన దారేది?



భీమిలి మండలం మజ్జివలస నుంచి పాత సామియ్యవలసకు మట్టి రహదారి

తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీకి చెందిన పాత సామియ్యవలస గ్రామం దూరంగా విసిరివేసినట్లు ఉంది. భీమిలి మండలం మజ్జివలస పంచాయతీ పక్కన గోస్తని నదీ తీరంలో వసతులకు దూరంగా ఉంది. ఈ గ్రామానికి రావాలంటే మజ్జివలస పంచాయతీ మీదుగా రాకపోకలు సాగించాలి. మహారాజుపేట–పద్మనాభం బీటీ రోడ్డు నుంచి మజ్జివలస సీసీ రోడ్డు ద్వారా ప్రయాణించిన వారికి పాత సామియ్యవలస వెళ్లడానికి గోతులు, రాళ్లతో ఎగుడు దిగుడుగా ఉండే మట్టిరోడ్డే దిక్కు. ఈ గ్రామానికి మరోపక్క గోస్తనినది ఉండటం వలన నదికి వరదలు వస్తే అంతే సంగతి. గ్రామాన్ని వరదనీరు చుట్టుముడితే రాకపోకలు కూడా స్తంభించిపోతాయి. పూర్వం ఈ గ్రామానికి ముంపు ప్రమాదం కారణంగా చాలా వరకు స్థానికులు నదికి అవతల కొత్త సామియ్యవలస పేరుతో గ్రామాన్ని ఏర్పాటు చేసుకుని వెళ్లిపోయారు. పాత సామియ్యవలసలో ఏవైనా వసతులు కావాలన్నా సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాండ్రంగి సచివాలయానికి వెళ్లాలి. నది వరద నీటితో పోటెత్తితే పాత సామియ్యవలస గ్రామం లాగే పాండ్రంగి గ్రామానికి కూడా రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. పాత సామియ్యవలసకు రహదారితో పాటు అంగన్‌వాడీ, పాఠశాల వంటి వసతులు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జీఎస్టీ ఫలాలు అన్ని వర్గాలకు చేరువ కావాలి



చంద్రంపాలెం హైస్కూల్లో జీఎస్టీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



భీమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు



జీఎస్టీపై కృష్ణాపురం కేజీబీవీ విద్యార్థులు వేసిన చిత్రాలు

మధురవాడ: జీఎస్టీ 2.0 ఫలాలు అన్ని వర్గాలకు అందేలా చూసేందుకు ప్రభుత్వం విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్, స్కూల్ ఎడ్యుకేషన్ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఎం. శ్రీలక్ష్మి తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. దేశం మొత్తం మీద ఒకే పన్ను వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు దీన్ని 2017లో ప్రవేశపెట్టారని, దానిని మరింత సరళతరం చేసేందుకు 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' పేరుతో 2.0 ని 2025 సెప్టెంబర్ 22 నుంచి తీసుకువచ్చారని తెలియజేశారు. ప్రజలకు అత్యవసర, విద్యాపరమైన, మందులు తదితర వస్తువులపై జీఎస్టీని 24 శాతం నుంచి 5శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వినోద్‌కుమార్, శ్రీకృష్ణ, జీఎస్టీవో ఎం. శ్రీనివాసరావు, ఏఈవోలు భరత్, దిలీప్, అప్పారావు, ఎంఈవో అనురాధ, హెచ్‌ఎం వెంకటరావు, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు. వాంబేకాలనీ సునీల్ శర్మ కాలనీ హైస్కూల్లోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న గ్రౌండ్ అభివృద్ధి పనులను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులతో కలసి రవితేజ పరిశీలించారు.

భీమిలి కేజీబీవీలో..

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద మంగళవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్ జీఎస్టీ గురించి విద్యార్థులకు పలు అంశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. మండల జీఎస్టీ నోడల్ అధికారి విజయకుమార్, ఎంఈవో శివరాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

కృష్ణాపురం కేజీబీవీలో..

పద్మనాభం: కృష్ణాపురంలోని కస్తూర్బా విద్యాలయంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో కె.రూపేష్ మాట్లాడుతూ మందులు, స్టేషనరీ వంటి వస్తువులపై జీఎస్టీ తగ్గించారన్నారు. జీఎస్టీపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంఈవో పి.రమణ, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

ఆనందపురంలో విద్యార్థులకు పోటీలు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో జానకి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. జీఎస్టీ అధికారి పి.ఫాల్గుణరావు, పంచాయతీ కార్యదర్శి రఘునాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంతపేటలో ర్యాలీ

జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట అంబేడ్కర్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీలో మార్పుల గురించి ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు వివరించారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అల్లుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న సమితి సభ్యులు

తగరపువలస: విజయరాంపురం త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి ప్రతినిధులు మంగళవారం భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ అల్లుపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు పండగల అర్థాలను ప్రబోధానంద గురువు గ్రంథాలలో తెలియజేశారని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వి.సురేష్, కె.సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో శ్రీకృష్ణుని ఆరాధన శుభప్రదం

- హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస
- ఘనంగా ప్రారంభమైన దామోదర దీపోత్సవం

తగరపువలస: కార్తీకమాసంలో శ్రీకృష్ణుని ఆరాధన శుభప్రదమని హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తెలిపారు. ఆనందపురం మండలం ఐఐఎంబీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదన్ మోహన మందిరంలో మంగళవారం నుంచి నెల రోజుల పాటు జరగనున్న దామోదర దీపోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాసాలలో కార్తీక మాసం శ్రీకృష్ణునికి ఇష్టమైనదని, కార్తీకమాసానికి దామోదర మాసమని పేరుందని తెలిపారు. ఈ మాసంలో శ్రీకృష్ణుని ఆలయాన్ని సందర్శించి, నెయ్యి దీపం వెలిగించి దామోదర అష్టకం పఠిస్తే వేల యుగాల పాపాల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. భక్తులు దామోదర అష్టకం పఠించి, నెయ్యి దీపాలతో హారతులు ఇచ్చారు. అంబరీష దాస తదితరులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



శ్రీరాధా మదనమోహనులు

అక్రమ కట్టడాలకు ప్రభుత్వ రక్షణ..!



ప్రభుత్వ స్థలంలో వెలసిన నివాసాలకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్

మధురవాడ: ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కొరడా ఝుళిపించాల్సిన అధికారులు, ఆ నిర్మాణాల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా ఉంది పరిస్థితి. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస శారదానగర్ కొండపై ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నివాసాలకు రక్షణగా ప్రభుత్వ నిధులతో గోడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా తాత్కాలిక రిటైనింగ్ వాల్ నిర్మించడం ఆరోపణలకు తావిస్తోంది. ఈ చర్యలు ఒకవైపు ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నట్లుగా ఉండగా.. మరోవైపు ప్రభుత్వ నిధులను ఈ విధంగా వెచ్చించడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.